# బతికినకథ

('రచన' మాసపత్రికలో ప్రచురణకు తీసుకున్న కథ)

ఇంకా చీకటి పడలేదు దూరంగా అక్కడొకరు ఇక్కడొకరు మనుషులు వెళ్తూవస్తూ కనపడుతున్నారు. రైలు పట్టాలక్కొంచెందూరంలో గడ్డిలో కూచున్నాడు శ్రీకర్. ఇంకొంచెంసేపట్లో అటువైపు నించి ఓ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ పట్టాలమీదుగా వెళ్తుంది. దానికింద పడి ఆత్మహత్య చేసుకోవాలని ఎదురు చూస్తూ కూచున్నాడు. ఇంకాసేపట్లో రైలిటు వెళ్ళే సమయానికి మసక చీకటిపడుతుంది. ఈ వైపు ఎవ్వరూ రారు కూడా.

"నేనింకా చదువుకుంటాను మావయ్యా...."

"చదివింది చాల్లే.. నిన్నింత వరకూ చదివించిందే ఎక్కువ, తన సూపర్ మార్కెట్లో పని చెయ్యడానికి ఓ కుర్రాడు కావాలన్నాడు శంకరయ్య, నిన్నుపంపిస్తానని చెప్పాను. రేప్పొద్దున్నించీ వెళ్ళు నోర్మూసుకుని."

అలా ఆగిపోయింది ఇంటర్మీడియట్‌తో శ్రీకర్ చదువు.

కొట్లోపనిచేస్తున్నా ఆలోచన లెటోపోతుండేవి. ఫలితం శంకరయ్య చేత తిట్లు ఇంటికొచ్చాక ఏకారణం లేక పోయినా ఇంట్లో వాళ్ళందరి చేతాచివాట్లు. ఎందుకొచ్చిన జీవితం అనిపించేది... అలాగే మూడు కేలండర్లు మారాయి అలాంటి పరిస్థితుల్లో... సూపర్ మార్కెట్లో తనతో పాటే పని చేసే పరిమళతో స్నేహం కాస్త ఊరడింపుగా తోచింది ఆమెపేరేకాదు మనసు కూడా సుగంధపరిమళమే.. మల్లెపూవులాంటిమనసు.

"నువ్వొక్కదానివే నాతో బాగామాట్లాడతావు పరిమళా ఇంకెవ్వరూ... ఆఖరికి మా ఇంట్లో వాళ్ళుకుడానాతో మాట్లాడటానికిష్టపడరు."

"ఇంట్లో వాళ్ళుకూడా సరిగ్గా మాట్లాడరా? ఎందుకూ?"

"నేను పుట్టక ముందే నాన్నని మింగానని.. పుట్టిన నెల్లాళ్ళకే అమ్మని మింగానని అంటారందరూ.. తాతయ్యకీ మావయ్యకీ పీకల్దాకా నామీదకోపం."

"అది నీతప్పెలా అవుతుంది? దానికి నువ్వేంచేస్తావు?"

"ఆమాత్రం నువ్వర్థం చేసుకున్నావు గానీ.. ఇంట్లో వాళ్ళూ బంధువులూ ఎవ్వరూ అర్థం చేసుకోలేదు."

"మీ తాతయ్యా మావయ్యాకాక ఇంకెవరెవరున్నారు మీ ఇంట్లో?"

"అత్తయ్య, పిల్లలూ ఉన్నారు అమ్మ పోవడానికి ముందే అమ్మమ్మ పోయిందిట అందుకే అమ్మమ్మ తెలియదునాకు ఆవిడుంటే నాపట్ల ఎలా ఉండేదో మరి?"

"ఇంట్లో మనుషులుండి కూడా ఒంటరితనం నీది.. ఎవ్వరూలేని ఒంటరితనం నాదీ, మా అమ్మదీ. ఇంట్లో మేమిద్దరమే ఉంటాం."

"మీ నాన్నగారు.."

"మానాన్నెవరో నాకు తెలియదు అడిగితే ఏడుస్తుందమ్మ అందుకే అడగడం మానేశాను."

"నువ్వేంత వరకూ చదివావు?"

"టెన్త్ పాసయ్యాను మరినువ్వు?"

"ఇంటర్, ఇంకా పైచదువులు చదువుకోవడం, ప్రకృతి అందాలు చూస్తూ కవితలు రాయడం ఇష్టం... కథలు రాయడం ఇష్టం."

"మీ మావయ్య చదువు కోడానికి వీల్లేదని చెప్పేశాడు కదా. అందుకని అది వొదిలెయ్యి." "కవితలు కథలు రాయి ఎవరొద్దన్నారు."

"మరి... మరి.. ఆదివారం ఒక్క రోజేకదా మనసూపర్ మార్కెట్‌కి సెలవు ఆ ఒక్క రోజైనా ఏదైనా రాద్దామని డాబామీద కెళ్ళి కూచుంటాను. వెంటనే తాతయ్య గానీ, మావయ్య గానీ, అత్తయ్య గానీ వొచ్చేస్తారు. నీ రాతలు నిన్నూ ఉద్ధరించవు

మమ్మల్నీ ఉద్ధరించవు అంటూ ఏవోపన్లు పురమాయిస్తారు. లాక్కుపోతారు అక్కడికీ ప్రతి ఆదివారం నేను క్రమం తప్పకుండా చెయ్యవల్సిన పన్లన్నీ చేసేశాకే.. డాబా మీద కూచుని కథోకవితో రాసుకుందామని వెళ్తాను.

"ఆదివారాలు ఇంట్లో ఏవేం పన్లు చేస్తావేంటి?" కుతూహలం తొంగిచూసింది పరిమళ గొంతులో.

"ప్రతి ఆదివారం సంతలో కూరలు తీసుకొస్తాను వెళ్ళి. ఇంట్లో అందరి బట్టలూ ఇస్త్రీ చేస్తాను. చిన్నచిన్నరిపేర్లు ఏవేం ఉన్నా యో అన్నీ చేసేస్తాను. పెరట్లోనూ ఇంటిముందు వైపూ గడ్డిపీకేసి మొక్కల్లో కలుపుతీసి అంతా క్లీన్ చేస్తాను. అత్తయ్యకి వంటింట్లో పనుల్లో సాయంచేస్తాను. నీళ్ళు పట్టి అన్నిట్లో నింపుతాను.

ఇవి చాలానట్టు పనిమనిషికూ్కడా నేనంటేలోకువే. ఆదివారాలు నేనింట్లో ఉంటాను కాబట్టి ప్రతి ఆదివారం నాగాపెట్టేస్తుంది. గిన్నెలుతోమేడ్యూటీ కూడా నాదే అవుతుంది మావయ్య ఒళ్ళు పట్టించుకుంటాడు. తాతయ్య తలంటు పోయించుకుంటాడు.. ఇవికాక మధ్య మధ్యలో మావయ్య పిల్చి ఫలానాచోటకెళ్ళి ఆయన్ని పిల్చుకురా ఫలానా చోట కెళ్ళి ఆయనతో ఈ మాట చెప్పిరా అంటూ బయటపన్ల మీద పంపుతూనే ఉంటాడు. చీటికీ మాటికీ కళ్ళెర్రజేస్తూ నువ్వీ ఇంట్లో మహారాజునను కుంటున్నావా దర్జాగా కూచోడానికి అంటూ తిడుతుంటాడు. ఆ ఇంట్లో మామూలు మనిషిగా ఉండేందుకే దిక్కు లేనప్పుడు మహారాజునని ఎందుకనుకుంటానసలు?"

"రాత్రిపూట అందరూ పడుకున్నాక అప్పుడు రచనలు చేసుకో"

"అలాగే చెయ్యాలింక కానీ దానికెన్ని తిట్లు భరించాలో... ఎక్కువ సేపు లైటేస్తే కరెంటు ఖర్చు ఎక్కువ చేస్తున్నానని తిడతారు. పోన్లే... నేను పడుకునే గది కిటికీలోంచి బయటి వీధి దీపంకాంతి పడుతుంది. ఆ కాంతిలో రాసుకోవాలంతే ఇంక" అలా మాట్లాడుకుంటూ ఇద్దరూ బస్‌స్టాప్ కొచ్చారు.

★★ ★★ ★★

ఇంట్లో అంతా బంధువులమ్మాయి పెళ్ళికని ఊరెళ్ళారు. ఇంటికాపలా శ్రీకర్. ఆదివారం కావడం వల్ల పన్లోకి వెళ్ళక్కర్లేదు మనసులో మెదిలిన ఆలోచన కథ రూపంలో కాగితమ్మీద పెట్టడం మొదలు పెట్టాడు. కథ పూర్తయ్యేదాకా బాహ్యప్రపంచమే తెలియలేదు. పూర్తయ్యాక టైమూ, ఆకలీ రెండూ తెలిశాయి. అన్నం తిన్నాక కథ ఫెయిర్ చేశాడు కానీ తన పేరుతో పంపిస్తే ఇంట్లో వాళ్ళకి తెల్సిపోతుంది. చిక్కుల్లో పడటం ఖాయం మరెలా? పరిమళగుర్తొచ్చింది. ఇల్లు తాళం పెట్టిబయల్దేరాడు. ఎప్పుడూ ఇంతవరకూ వాళ్ళింటికి వెళ్ళలేదు. కానీ పరిమళదీ వాళ్ళమ్మ గారిదీ ఇద్దరిదీ పర్మిషన్ తీసుకోకుండా వాళ్ళింటి అడ్రసు వాడుకోకూడదు కదా. అందుకే తప్పదు మరి వాళ్ళింటికి వెళ్ళడం.

★ ★ ★

తమ ఇంటి అడ్రసుకి వచ్చిన కార్డు తనహేండ్ బ్యాగ్‌లోంచి తీసి శ్రీకర్‌కి ఇచ్చింది పరిమళ కంగ్రాట్సు చెప్తూ.

వారపత్రిక వారి దగ్గర్నించి తనకథప్రచురణకు తీసుకున్నట్లుగా వచ్చిన ఆ ఉత్తరం చదివి పొంగిపోయాడు శ్రీకర్.

"కబుర్లుచెప్పు కోడాలేనా? పని చూసుకోడం లేదా?" ఖంగుమంది శంకరయ్య గొంతు, వాళ్ళిద్దరూపన్లో నిర్లక్ష్యం చూపించకపోయినా పని చక్కగాచేస్తున్నా కూడా... ఈ మధ్య ఇద్దరూ తనకి వినపడకుండా మెల్లిగా ఏవోమాట్లాడు కోడం చూస్తుంటే గుర్రుగా ఉంది శంకరయ్యకి.

★ ★ ★

అది మొదలు శ్రీకర్ అప్పుడప్పుడు కథలు కవితలు రాసి "ఏకలవ్య" పేరుతో పంపు తుండటం ప్రచురింప బడటం జరుగుతోంది. ఎప్పటికప్పుడు అవి పోస్టుచేసే బాధ్యత తను తీసుకుంది పరిమళ తల్లి సావిత్రి.

"మా మీద ఓకథ రాయకూడదూ?" హఠాత్తుగా ఆరోజు అడిగింది పరిమళ

"మీ మీదా? ఏముంది రాయడానికి?"

"ఏం లేదని అడుగు"

"అబ్బో! అయితే చెప్పు"

ఎలా మొదలు పెట్టాలో ఆలోచిస్తున్నట్టుగా ఒక్క నిమిషం మౌనంగా ఉండి ఆతర్వాత చెప్పడం మొదలు పెట్టింది పరిమళ.

"అమ్మా, అమ్మమ్మా పల్లెటూళ్ళో ఉండేవారు కాస్తపొలం, నిమ్మతోటా ఉండేవి అమ్మచిన్నప్పుడే తాతయ్య పోవడంతో.. ఆపొలం పన్లూ తోట సంగతీ అంతా స్వయంగా తనే వెళ్ళి ప్రతి రోజూ నిలబడి చేయిస్తూ ఉండేది అమ్మమ్మ. ఇంట్లోపన్లు అమ్మ చూసుకుంటే ఉండేది. అమాయ కత్వంతో అందర్నీ మంచివాళ్ళుగా నమ్ముతూ ఉండే అమ్మని మాయమాటల్లో లోబర్చుకుని... తాళికడతానని చెప్పి నమ్మించి.. తల్లి కాబోతోందని తెలియగానే పలాయనం చిత్తగించాడొక మగ మహారాజు, అమ్మ అమ్మమ్మల ఏడుపు సమస్యని చక్క బరచలేదు కదా! కొద్దిరోజుల్లోనే పులి మీద పుట్రలా అమ్మమ్మని మృత్యువు వాటేసుకుంది. పొలంనించి వొస్తుంటే పాముకాటుకి బలైపోయింది. ఆవిడ పోయిందని తెల్సి.. పరారైపోయిన ఆమగ మహారాజు మళ్ళీ అమ్మముందు ప్రత్యక్షమయ్యాడు, తాళికడతాను గానీ.. అపొలం నిమ్మతోటా... తాళికట్టడానికి ముందే తనపేరున రాయాలని షరతు పెట్టాడు. గొర్రెకసాయివాడిని నమ్ముతుంది ఆయన గారి పేరుకి మార్పించింది అమ్మ. తాళికట్టడానికి ముహూర్తం కావాలి గానీ.. కాగితాలు చేతిలో కిరాగానే.. ఆ తోటా... ఆపొలం అమ్మేసి పైకం తీసుకుని పారి పోవడానికి ముహూర్తం అక్కర్లేదుగా.. అదే జరిగింది ఆరోజు మొదలుకుని అమ్మపడిన పాట్లు అన్నీ ఇన్నీ కావుట మోసం చేసిపోయిన ఆ మనిషి తన తల్లి తండ్రులు చెప్పిన పిల్లని పెళ్ళాడటం తెల్సిందమ్మకి, ఎక్కడున్నాడో కూడా తెల్సింది కానీ... విరక్తితో మౌనం వహించింది. తన బతుకు తను బతక డానికి నిశ్చయించుకుంది ఊళ్ళో దయగల తల్లుల సహాయం వల్ల... పరువుగా.. తన కాళ్ళమీద తను నిలబడి బతకడం మొదలు పెట్టింది పుట్టబోయే బిడ్డ కోసం జీవితం మీద ఆశపెంచుకుంది. నేను పుట్టాక నాకోసమే బతుకుతోంది. బతుకు తెరువు కోసం ఈ ఊరొచ్చి రకరకాల పన్లు విరామంలేకుండా చేస్తూ పరువుగా రోజులు

నెట్టుకొస్తోంది. తనకి తెల్సిన కుట్లు అల్లికలు నలుగురికీ నేర్పిస్తూ మిషను మీద బట్టలు కుడుతూ ఊరగాయలు వడియాలు పెట్టి షాపుల వాళ్ళకి అమ్ముతూ ఇన్నిపన్లు నిమిషం తీరికలేకుండా చేస్తూ మెల్లి మెల్లిగా నిలదొక్కుకుని పదిమంది పిల్లల్తో క్రెచ్ నడపడం మొదలు పెట్టింది. ఒకరిని దేహీ అని అడగకుండా మా బతుకులు మేం బతుకుతున్నా కూడా కాకుల్లా పొడిచే లోకులున్న సమాజం కదా మనది, కొందరు అదోరకంగా చూస్తుంటారు మమ్మల్ని, మరికొందరు రకరకాల మాటలు అంటూ ఉంటారు. దీని కంతటికీ మూలకారణం అమ్మని మోసంచేసిపోయిన ఆ మహాను భావుడు కాదూ? ఎప్పటికి తెల్లవారేను మా బతుకులు? ప్రాణం ఉంది కాబట్టి బతకాలి కనక బతుకు తున్నాం అమ్మ మనసులో ఎంతబాధ, దుఃఖం దాచి పెట్టుకుని రోజులుగడుపుతోందో నాకు తెల్సు నేనర్థం చేసుకోగలను, అందుకే అమ్మ ఎదురుగా నేనెప్పుడూ ఏడవను" పంటిబిగువున కన్నీరాపు కుందుకు వ్యర్థ ప్రయత్నం చేసింది పరిమళ, ఆమెకి ధైర్యం చెప్తూ ఓ దార్చాడు శ్రీకర్. ఆరాత్రి కూచుని ఓ చక్కటి కథ రాశాడు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఎంతటి కష్టాల్లోనూ ఏవ్యక్తీ ఆత్మహత్య చేసుకోవాలన్న తలంపుకి చోటివ్వ కూడదని, ధైర్యం గానూ ధర్మంగానూ జీవితంలో ముందుకి సాగిపోవాలని చక్కటి కథనం, చక్కటి శైలితో చదివిన ప్రతి వారి మనసులోనూ పది కాలల పాటు నిలిచిపోయే కథ.

★★ ★★ ★★

పడుకోబోతుండగా మోగింది ఫోను ఈ టైములో ఎవరా అనుకుంటూ తీశాడు నాగభూషణం... శ్రీకర్ మేనమావ.

"హలో... నాగ భూషణంగారే నాండీ?"

"ఔనండీ....మీరు"

"మీ మేనల్లుడు పనిచేసే సూపర్ మార్కెట్ ఓనర్ని శంకరయ్య నండీ. మీ వాడిని పన్లో పెట్టిన రోజు రహస్యంగా నాతో మీరన్నారు కదా... వాడితో ఏవన్నా గొడవలొచ్చినా వాడి ప్రవర్తన సరిగ్గా లేక పోయినా మీతో చెప్పమన్నారు. కదా! అందుకే మీ జాగ్రత్తలు మీరు పడతారని చెప్తున్నాను...."

"చెప్పండి... ఏం జరిగిందండీ?" నాగభూషణం గొంతులో కంగారు..

"మా షాపులోనే పరిమళ అనే అమ్మాయి కూడా పని చేస్తోందండీ. అదీ మీ వాడూ ప్రేమలో పడ్డారు.. లవ్ లెటర్లనుకుంటా కవర్లో పెట్టి దాని కిస్తూ ఉంటాడు మీ వాడు. అది కూడా హ్యాండ్ బ్యాగ్‌లోంచి ఏవేవో తీసి మీవాడికిస్తూ ఉంటుంది. ఇద్దరూకల్సి ఎవరికీ వినపడనంత మెల్లిగా ఏవోరహస్యాలు మాట్లాడుకుంటూ ఉంటారు. దాని తల్లి కేరక్టర్ మంచిది కాదు. పైగా మీకసలే కులం పట్టింపుకదా?"

నెత్తి మీద పిడుగు పడినట్టయింది నాగభూషణానికి.

"అపుడప్పుడు మీరు ఏదైనా ఊరెళ్ళినప్పుడు మీ వాడుదానింటికి వెళ్తూవస్తూ బాగానేతిరిగాట్ట చూసిన మా బావమరిది చెప్పాడు."

"అలాగా! నేను వాడి సంగతి చూస్తాను. ఇలాంటి వేషాలు మా ఇంటావంటా లేవు. నిప్పులు కడిగే మనిషిన్నేను తింగరివేషాలు నేనెప్పుడూ వెయ్యలేదు. నా ఇంట్లో వాళ్ళెవరేసినా ఊర్కోను వాడి ప్రవర్తన గురించి చెప్పినందుకు చాలాథ్యాంక్సు మీకు"

"అయ్యో.. పర్వాలేదండీ... ఇంక ఉంటానండీ.."

★★ ★★ ★★

పరిమళ మొహం అదోలా ఉండడం గమనించాడు శ్రీకర్

శనివారం తనుపన్లోకి రాలేదు. మర్నాడు ఆదివారం సెలవురోజు ఈ రెండ్రోజుల్లో మొహం అంతపీక్కు పోయిందేవిటి? దగ్గిరకి వెళ్ళి అడిగాడు. "అలా ఉన్నావేం? ఒంట్లో బాగులేదా? శనివారం రాలేదు" "నాకు బానేఉంది శుక్రవారం రాత్రి అమ్మ చాలా హడావిడి చేసింది కడుపులో నెప్పితో గిలగిల లాడిపోయింది. మా వీధిలో ఓ డాక్టరు గారున్నారు. ఆయనమందిచ్చి మార్నాడేవోటెస్టులు చేయించమన్నారు. చేయించాను. దేవుడి దయవల్ల అన్నీ నార్మల్‌గానే ఉన్నాయి.

"పూర్తిగా నెప్పి తగ్గిపోయి ఇప్పుడు తేరుకున్నారు కదా!"

"ఆ... ఇప్పుడు బాగానే ఉంది. శుక్రవారం రాత్రి.. ఆ బాధలో... తను పోతాననే అనుకుంది. అందుకే.. పోయేముందైనా.. నా తండ్రెవరో చెప్పాలని నిశ్చయించుకుని... తనపెట్టెలో అట్టడుగునదాచుకున్న కవరు బయటికి తీయించింది. నా చేత అందులో ఉంది ఆయన ఫోటో.. ఇదుగో నీక్కూడా చూపిద్దామని తీసుకొచ్చాను" హాండ్‌బ్యాంగ్‌లోంచి ఫోటో బయటికి తీసింది పరిమళ.

చిత్తరువే అయ్యాడు శ్రీకర్ అదిచూసి.. మావయ్య... తనమేనమావే.. ఆఫోటోలో ఉన్నది. ఇంట్లోగోడకున్న పాతఫోటోల్లో మావయ్యది ఈ ఫోటో కూడా ఉంది. చిన్న బొచ్చుకుక్క పిల్ల నెత్తుకుని తీయించుకున్నాడు. భుజాన ఇంతపొడుగు వేలాడే సంచీ.. ఇదే.. ఇదే.. ఈ ఫొటోనే ఇంట్లో గోడకున్న పాత ఫొటోల్లో ఉంది మావయ్యది.

★★ ★★ ★★

"దానిఇంటి కెళ్ళొస్తున్నావా?" పిడుగు పడినట్టే అరిచాడు నాగభూషణం లోపల అడుగుపెట్టిన శ్రీకర్ ఒక్క నిమిషం అలాగే నిలబడిపోయాడు.

"ఎందుకలా చూస్తావు? ఎలా తెల్సిపోయిందనా? నువ్వేసేవేషాలు.. దానితో కల్సిదానింటికి తిరుగుళ్ళు నువ్వు దాచినా దాగుతాయనుకున్నావా?"

"మాట్లాడవేం?"

ఏం మాట్లాడాలి. తనేమీ వేషాలెయ్యలేదు.. ఆ అమ్మాయితో కల్సి కులాసా తిరుగుళ్ళు జల్సాతిరుగుళ్ళు తిరగలేదు.

"చాలా రోజులుగా నడుస్తున్నట్టుందిగా మీ మధ్య వ్యవహారం ఎవత్తదీ?

అది నిన్నువల్లో వేసుకుందా? నువ్వేదాన్ని బుట్టలో వేసుకున్నావా? ఇరవై ఒక్కేళ్ళు వొచ్చేశాయని ఎవర్నీ లెక్క చెయ్య కూడదనుకుంటున్నావా ఇంక?"

ఆయన అరుపులకి ఇంట్లో అందరూ పోగయ్యారు మరికొన్నిక్షణాల్లో ఈ పక్కింటివాళ్ళు ఆపక్కింటివాళ్ళు ఎదురింటి వాళ్ళు అందరూ గుమ్మంలో చేరి వినోదం

చూడటం మొదలు పెట్టారు. అంత మందిని చూడగానే మరింత రెచ్చిపోయాడు నాగభూషణం.

"కడుపులో పడగానే తండ్రిని మింగావు. పుట్టగానే తల్లిని మింగావు.. ఇప్పుడు పరువు పోగొట్టి మమ్మల్ని మింగుతున్నావు.. ఇంకా ఎంతమందిని మింగుతావిలా? కులం గోత్రం లేని దాంతో ప్రేమ కావల్సొచ్చిందా నీకు ప్రేమ... ఇప్పుడు నీ మొహానికి ఆదొక్కటే తక్కువైంది.. పరువులేని పిల్లతో ప్రేమలా? అసలు నిన్ను పన్లో జేర్చానుగానీ ప్రేమాయణంలో పడమని పెట్టలేదు..." ఆ తిట్ల ప్రవాహానికి అంతులేకుండా పోయింది సాగి పోతూనే ఉంది.

అవమానం.. బాధ.. దుఃఖం సుళ్ళు తిరుగుతున్నాయి. శ్రీకర్ మనసులో.. పరువులేని వాళ్ళు కాదువాళ్ళు.. మోసంతోవంచన చేసే నీబోటివాళ్ళే పరువుతక్కువ మనుషులు నాదృష్టిలో... వాళ్ళీస్థితిలో ఉండటానికి కారణం నువ్వు కాదూ?... వంచనచేసిన నువ్వేమో పెద్దమనిషిలా పరువుగల మనిషిలా బతికేస్తున్నావు.. వంచనకి గురయిన వాళ్ళని పరువులేని మనుషులంటున్నావు... నువ్వసలు మనిషివి కాదు మనిషి కాదు.. పశువు కంటే హీనం గట్టిగా అరవాలనిపించింది.. కానీ. దుఃఖంతో గొంతు పూడుకు పోయింది.. మరి ఒక్కక్షణం అక్కడ నిలబడాలనిపించలేదు.

★★ ★★ ★★

"అదిగో వొచ్చేస్తోంది ఎక్స్‌ప్రెస్ రైలు"... గబగబా వెళ్ళి పట్టాల మీద పడుకుని కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. అన్యాయాన్నీ.. అక్రమాన్నీ.. మోసాన్నీ.. అయిన వాళ్ళల్లో చూస్తూ బతికేకంటే చావునయం... అవును... అవును....

★★ ★★ ★★

"అయ్యయ్యో... ఎవరు మీరు? ఎంతపని చేస్తున్నారు? లేవండి" అప్పుడే అటుగావచ్చిన ఓ వ్యక్తి పట్టుకుని కుదిపేశాడు.

"ఆత్మహత్య మహా పాపం అన్నారు.. లేవండి మీరు చేస్తున్నది చాలా తప్పు ఒకప్పుడు నేను కూడా కష్టాలు భరించలేక ఆత్మహత్యచేసు కోవాలనుకున్న మాట నిజం.. కానీ.. అటు వంటిపని చెయ్య కూడదని... అదిపరిష్కారం కాదని చెప్తూ నామనసుమార్చింది ఒకథ. అలాంటి పిరికి.. నిర్ణయం తీసుకోకుండా నన్ను కాపాడి ఒక మనిషిగా నిలబెట్టింది నేను చదివిన ఆకథ కథ. చదివిన నాకే ఎంతో మానసికబలం వచ్చింది.... ఇంక ఆకథారచయిత ఏకలవ్యగారి కెంతమనోబలం ఉండి ఉంటుందో?

'ఉలిక్కిపడ్డాడు శ్రీకర్.

"తప్పకుండా మీరుకూడా ఆ కథ చదవాలి. నాదగ్గిరుంది ఇస్తాను. చదువు దురుగాని లేవండి" చేయి అందించాడు ఆ నూతన వ్యక్తి. అందుకున్నాడు శ్రీకర్. హనుమంతుడికి ఆయనశక్తి ఆయనకే గుర్తు చేసినట్టు... తనకథ తనకే గుర్తుచేసి.. ఆవేదనతో ఆవేశంతో తాను తప్పు చెయ్యబోతే అడ్డుకున్న అతను దేవుడిలా కనిపించాడు. ఔను... దైవం మానుషరూపేణా అని ఊరికే అనలేదు పెద్దలు.. నిజం.. అదినిజం... కృతజ్ఞతలు చెప్పుకున్నాడ తనికి. తాను అండగా నిలబడవలసిన వ్యక్తులిద్దరుండగా అదిమరిచి ఆత్మహత్య తలపెట్టడం తప్పేమరి... కొత్త ఉత్సాహంతో నడక సాగించాడు.. ఆదారిలోవెళ్తే వొచ్చేది మావయ్య ఇల్లు కాదు పరిమళా వాళ్ళిల్లు.

★★ ★★ ★★